క్లుప్తంగా

రాముడికి హనుమంత సేవ

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో శనివారం శ్రీరామచంద్రుడికి హనుమంత వాహనంపై విశేష పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

22 నుండి వలంటీర్లకు వందనం

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు మండలంలోని గ్రామ వలంటీర్లకు సచివాలయాల వారీగా వందనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న శకునాలపల్లి, తిరుమలాపురం, 23న అప్పసముద్రం, ఉదయగిరి-2, 24న బండగానిపల్లి, వెంగళరావునగర్, 25న కృష్ణంపల్లి, కొండాయపాళెం, 26న ఉదయగిరి-1,3, 27న జీ.చెరువుపల్లి, నేలటూరు సచివాలయాల్లో వలంటీర్లకు సన్మానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం రేపు

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేసేందుకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపకరణాలను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



ప్రతిష్టామహోత్సవాలు నిర్వహిస్తున్న రుత్వికులు, దంపతులు

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రుత్వికులు వేద మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, కలశ స్థాపన, నవగ్రహ, వాస్తు, మండపారాధన, అంకురారోపణ, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం, జలాధివాసము, గణపతి, రుద్ర, నవగ్రహ, చండీహోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు జగనన్న రాగి జావ గ్లాసులు పంపిణీ


ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ అందించేందుకు శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ మస్తాన్‌వలి హెచ్‌ఎంలకు గ్లాసులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రక్తహీనత, ఐరన్ లోపం తదితర సమస్యలు పరిష్కరించేందుకు పౌష్టికాహారం అందించాలనే మంచి నిర్ణయంతో రాగిజావ పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది అలీం, వశీం పాల్గొన్నారు.

డీపీఓను కలిసిన ఏపీఎన్‌జీఓ నేత



కలిగిరి: జిల్లా పంచాయతీ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన ఎం. సుస్మితారెడ్డిని ఏపీఎన్‌జీఓ వింజమూరు తాలుకా అధ్యక్షుడు, కలిగిరి ఈఓపీఆర్డీ వెలుగోటి మధు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. స్థానికంగా ఉద్యోగుల సర్వీసులకు సంబంధించిన అంశాలను డీపీఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగులకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తామని ఆమె తెలిపారు.

పంటలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొండాపురం: మండలంలోని కొమ్మి, సత్యవోలు, అగ్రహారం, పార్లపల్లి గ్రామాల్లో వింజమూరు ఏడీఏ ఎస్.రామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వేసవిలో నల్ల నేలలో సజ్జ, నువ్వు, జనుము పంటలు సాగు చేయాలని సూచించారు. శనగ వేసిన పొలాలు వేసవిలో ఖాళీగా ఉంచకుండా మే 15 నుంచి జూన్ 15 మధ్య కాలంలో వర్షాలు పడితే ఎకరాకు మూడు కేజీలు సజ్జ కావేరిబాస్, కర్న అనే రకాలు చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డీపీడీ ఉపసంచాలకులు జి.శివన్నారాయణ, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేస్తే బాబుకు కంటగింపు

- టిడ్కో ఇళ్ల పేరుతో పిచ్చుకగూళ్లు
- అవీ అసంపూర్తిగా నిర్మించిన చంద్రబాబు
- ఇండిపెండెంట్‌గా స్థలాలు, ఇళ్లు ఇచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- ఓర్వలేక సమాధులతో పోల్చడం గర్హనీయం
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేక, చంద్రబాబు దురాహంకార ధోరణితో వ్యవహరిస్తున్నాడని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పథకాల ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ముఖ్యంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసే క్రమంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తుంటే చంద్రబాబుకు కంటగింపుగా మారిందన్నారు. పట్టణంలోని ఎంజీఆర్ కార్యాలయంలో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య స్థానిక నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరు అంకణాల స్థలం శవాలు పాతిపెట్టడానికా అని చంద్రబాబు విమర్శించడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ఆయన అసంపూర్తిగా నిర్మించిన టిడ్కో భవనాల్లో లబ్ధిదారులకు ఎన్ని అంకణాల్లో ఇళ్లు నిర్మించారని ప్రశ్నించారు. అర్ధాంతరంగా నిర్మాణాలు వదిలేసిన టిడ్కో ఇళ్లను జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తున్న విషయం బాబుకు కనిపించడం లేదా అని నిలదీశారు. రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు తన స్థాయిని దిగజార్చుకుని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లు మంజూరు చేసిన ఘనత, దేశంలోనే అత్యధికంగా ఇళ్లు పారదర్శకంగా పంపిణీ చేసిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని కేంద్రం కితాబిచ్చిన విషయం బాబు తెలుసుకోవాలన్నారు. డిప్రెషన్‌లో నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదని హెచ్చరించారు. అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే మురికివాడలా తయారవుతాయని పేదలను కించపరిచేలా బాబు మాట్లాడడం తగదని హితవు పలికారు. వెంకటగిరి సమీపంలోని జయంపులో దళితులకు చెందిన భూమిని ఆక్రమించిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, ఎస్‌కే సర్దార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పెంచలయ్య, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు సయ్యద్ జమీర్, కొప్పోలు చిన్నపరెడ్డి, కిషోర్, ఎన్ ప్రతాప్, కలాం, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితిపై డీఎస్పీ, కమిషనర్ పరిశీలన



సోమశిల రోడ్డులో పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో పోలీసుస్టేషన్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్, అక్కడ నుంచి బాలుర హాస్టల్ వరకు నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ జామ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు, మున్సిపల్ అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. డీఎస్పీ ఎస్ కోటారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎస్సై ఎం.శివశంకర్‌రావు ఆ రెండు రోడ్లలో సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందో గుర్తించారు. దుకాణదారులు తమ షాపుల ముందు బోర్డులు, సరుకులు పెట్టరాదని అధికారులు సూచించారు. సోమశిల రోడ్డు మలుపులో ఏర్పాటు చేసిన పోలీసు బూత్‌ను తొలగించి ఆ మేరకు రోడ్డులో ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆర్టీసీ, ఆటోవాలాలు, ప్రయాణికులు సహకరించాలని డీఎస్పీ, కమిషనర్ కోరారు. మున్సిపల్ ఏఈ జే ప్రసాద్, పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాల కల్పన



మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

వరికుంటపాడు: మండలంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించినట్లు ఏపీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని జడదేవిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి పని ప్రదేశంలో కూలీలకు షెడ్డు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, మెడికల్ కిట్ సౌకర్యాలు కల్పించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు చల్లని వాతావరణంలోనే కొలతల ప్రకారం పనులు చేసుకుని గిట్టుబాటు కూలీ పొందాలని సూచించారు.

జియో ట్యాగింగ్ సకాలంలో పూర్తిచేయాలి



లేఅవుట్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

ఉదయగిరి: మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు జగనన్న లబ్ధిదారుల నివేశన స్థలాలను సకాలంలో జియో ట్యాగింగ్ చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన శనివారం మండలంలోని శకునాలపల్లెలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. స్థలాలు కేటాయించిన ప్లాట్లలో గృహనిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడి సేవల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కరీముల్లా, ఖాదర్ కరీముల్లా, మండల కో-ఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు



బస్సు కింద నుంచి మంటలు

చేజర్ల(సోమశిల): ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన ఘటన అనంతసాగరంలో శనివారం జరిగింది. స్థానికులు, ప్రయాణికుల సమాచారం మేరకు.. బద్వేలు డిపోకు చెందిన బస్సు కలువాయి నుంచి బద్వేలుకు వెళ్తున్న సమయంలో అనంతసాగరం వద్ద సాయంత్రం 5.30 గంటలకు బస్సులో అకస్మాత్తుగా పొగలు కింద నుంచి మంటలు రావడంతో స్థానికులు గుర్తించారు. కొందరు డోర్ ద్వారా, కొందరు ప్రయాణికులు ఎగ్జిట్ డోర్‌ను పగులగొట్టి బయటకు వచ్చారు. ఈ బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. పక్కనే ఉన్న వాటర్ ప్లాంట్ నుంయి నీరు తెచ్చి మంటలను ఆర్పి వేశారు. డ్రైవర్ బ్యాటరీ, ఇం.ఇన్‌ను పరిశీలించి సాంకేతిక సమస్యలు ఉన్నాయని గుర్తించారు. స్థానికులు అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు.

రీ సర్వేపై అభ్యంతరాలకు అప్పీల్ చేసుకోవచ్చు

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడులో రీ సర్వేకు సంబంధించి అభ్యంతరాలపై భూ యజమానులు అప్పీల్ చేసుకోవచ్చనని డీటీ ఎం. గిరీష్ తెలిపారు. శనివారం స్థానిక పెరుమాళ్లపాడు సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే పూర్తయిన భూయజమానులకు సంబంధించి వారి అనుభవంలో ఉన్న భూ వివరాలతో కూడిన నోటీసులను అందజేశామన్నారు. ఈ నోటీసులో కనబరిచిన విస్తీర్ణానికి సంబంధించి తేడాలు ఉన్నట్లు అయితే అందుకు సంబంధించిన అప్పీల్‌ను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేకు సంబంధించి ముసాయిదా డీఎల్ఆర్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పావని, గ్రామ సర్వేయర్ పెంచలయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): ఇంధన వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని మర్రిపాడు అటవీశాఖ డీఆర్‌ఓ రవీంద్రబాబు తెలిపారు. మర్రిపాడు సచివాలయంలో మిషన్ లైఫ్ ఫీల్ ఎన్విరాన్‌మెంటల్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించడం, డీజిల్, పెట్రోల్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా బ్యాటరీ వాహనాలు వాడడం, గృహ అవసరాలకు విద్యుత్ వినియోగం తగ్గించడం, నీటి వాడకంలో పొదుపు తదితర అంశాలపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఏఓ రామ్మోహన్, అటవీ బీట్ ఆఫీసర్లు మల్లికార్జునరావు, హుస్సేన్‌బాషా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై నిఘా పెట్టండి

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): గ్రామస్థాయిలో అక్రమంగా మద్యం విక్రయాలతో పాటు గుట్కా, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు అమ్మే వారిపై నిఘా ఉంచాలని సెబ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. మర్రిపాడు పోలీసుస్టేషన్‌లో శనివారం మండలంలోని సచివాలయాల మహిళా పోలీసులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చిల్లకర్ర వేలంపాట

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు ఊటచెరువులోని చిల్లకర్ర కొట్టుకునేందుకు శనివారం ఇరిగేషన్ అధికారులు సచివాలయంలో వేలంపాట నిర్వహించారు. వింజమూరు ఇరిగేషన్ డీఈ రవి, ఏఈ ఖాదర్‌మస్తాన్ ప్రభుత్వం తరఫున రూ.1,63,144 దేవుడి పాటగా నిర్ణయించగా రూ.3.03 లక్షలకు వేంపాడుకు చెందని తాతపూటి అభిషలోం వేలం దక్కించుకున్నాడు.

వేడుకగా గంగమ్మ జాతర ప్రారంభం

జలదంకి: జలదంకిలోని లేదోట గంగమ్మ జాతర శనివారం వేడుకగా ప్రారంభమైంది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మకు ఏటా జాతర నిర్వహిస్తారు. శనివారం ఉదయం లేదోట గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. రాత్రికి గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం గ్రామ దేవతకు పొంగళ్లు, మొక్కులు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో కావలి జట్టు ప్రతిభ

- రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం



తృతీయ స్థానం సాధించిన జట్టుతో శిక్షకుడు

కావలి: పాలకొల్లులో జరిగిన అండర్-16 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో కావలి జట్టు తృతీయ స్థానం సాధించినట్లు శిక్షకుడు పి.జోసఫ్ శనివారం చెప్పారు. ఈ జట్టులో సీహెచ్ మదన్, ఎం.అరుణ్, పి.జాషువా, కేఎల్ శ్రీనివాస్, ఎం.హేమంత్, ఎస్‌కే వసీం రెహాన్, కె.లక్ష్మీనరసింహం, షేక్ నెహల్ తదితులు సభ్యులుగా ఉన్నారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించండి

ఉదయగిరి: పట్టణంలోని గండిపాళెం వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్థానీ, ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్ శనివారం కలెక్టరుకు వినతి పత్రం పంపించారు. ఈ శ్మశాన వాటిక రాజుల కాలం నుంచి ఉందన్నారు. శ్మశానంలో సరైన సదుపాయాలు లేక ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

వలంటీర్ల హాజరు తనిఖీ

ఆత్మకూరురూరల్: మండలంలోని మురగళ్ల సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. వలంటీర్ల హాజరు సక్రమంగా లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఆనంద్‌రెడ్డి, నీలిమా, ఏఎస్ఎం రాఘవరాణి, సచివాలయ సిబ్బంది కవిత, అక్బర్, రుషీకర్ పాల్గొన్నారు.

తెలుగు భాషపై మమకారం ఉండాలి

చేజర్ల(సోమశిల): ప్రతి విద్యార్థి తెలుగు భాషపై పట్టు సాధించాలంటే ఆ భాషపై పట్టు ఉండాలని తెలుగు పండితుడు అల్లంపాటి రఘురామిరెడ్డి చెప్పారు. అనంతసాగరంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం తెలుగులో పదాలు వాడే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అమ్మ మీద ఎంత మమకారం ఉంటుందో మాతృభాష తెలుగుపై అంత ఇష్టముండాలని సూచించారు. కొన్ని కవితలు, కథలు వివరించారు. లైబ్రేరియన్ డి.నారాయణరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్ల పంచాయతీ నబ్బీనగరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రావూరు శ్రీనివాసులురెడ్డి, జగన్ పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక సహాయం



సహాయం అందజేస్తున్న నిర్వాహకులు

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన ఒంటరి మహిళ ఆయేషాకు ఆరోగ్యం బాగలేక పోవడంతో సంయుక్త సేవా సంస్థ తరఫున రూ.13 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు

- ఎంపీపీ పద్మావతి



బసినేనిపల్లి సచివాలయంలో వలంటీర్లతో ఎంపీపీ పద్మావతి, అధికారులు

సీతారామపురం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. బసినేనిపల్లి సచివాలయంలో శనివారం వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించారు. ఆమె మాట్లాడుతూ లంచాలు, వివక్షకు తావు లేకుండా కేవలం సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తుండాలన్నారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ వలంటీరు సేవలను ప్రోత్సహిస్తూ వరుసగా మూడో ఏడాది అత్యున్నత ప్రతిభ కనపరచిన వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. సేవా వజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, ప్రతి వలంటీరుకు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం వలంటీర్లకు శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె విజయమ్మ, ఏఓ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'బతుకుదెరువును ధ్వంసం చేశారు'



ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళ సుచిత్ర

దగదర్తి(కావలి): దగదర్తి మండలం చెన్నూరు పంచాయతీ తిమ్మారెడ్డిపాళెంకు అగ్రకులస్తులు తన జీవనాధారమైన కూరగాయల పంటను ధ్వంసం చేశారని, సాగు భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని గిరిజన మహిళ యాకసిరి సుచిత్ర వాపోయింది. కావలిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో బాధితురాలు తన గోడు వెల్లబోసుకుంది. తిమ్మారెడ్డిపాళెంకు చెందిన గిరిజన మహిళ యాకసిరి సుచిత్రను భర్త వదిలేయడంతో ఇద్దరు చిన్నపిల్లలతో గ్రామంలో జీవనం సాగిస్తోంది. కూలీ పని చేసుకుంటూ, తన ఇంటి పక్కనే ఉన్న స్థలంలో కూరగాయలు పండించుకుంటూ బిడ్డలను పోషించుకుంటుంది. ఈ భూమికి పట్టా కోసం గతంలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు కూడా చేసుకుంది. రీ సర్వేలో ఈ భూమి సుచిత్ర పేరుపైన నమోదయ్యే అవకాశం ఉండటంతో అదే గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి, రాధారెడ్డి, రాఘవరెడ్డి దౌర్జన్యానికి దిగి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు బాధితురాలు వాపోయింది. అర్థరాత్రి అక్రమంగా తన భూమిలోకి ప్రవేశించి సార పాదులు ధ్వంసం చేయడంతో పాటు భూమిలోకి దిగితే చంపేస్తామని బెదిరించినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపింది. జిల్లా అధికారులైనా స్పందించి తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. భూమిపోతే తనకు, తన బిడ్డలకు ఆత్మహత్య తప్ప మరో గత్యంతరం లేదని కన్నీటి పర్యంతమైంది.

ప్రసన్నుని భక్తులకు చల్లటి మజ్జిగ, మంచినీరు



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి దర్శానికి వచ్చే భక్తులకు చల్లటి మజ్జిగ, మంచినీరు అందించే కార్యక్రమాన్ని శనివారం నుంచి ప్రారంభించారు. స్వామి వారి దర్శనానికి పిల్లా పాపలతో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు వేసవి తీవ్రత కారణంగా ఇబ్బంది పడకుండా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించడంతో ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం వందలాదిగా వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానంతరం మజ్జిగ సేవించి సేద తీరారు. వేసవి పూర్తయ్యే వరకు మజ్జిగ, మంచి నీటి చలివేంద్రాలను కొనసాగించనున్నట్లు పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఓబుల్‌రెడ్డి, అరవ తులసీరామ్, ఆలయ ప్రధానార్చకులు ఈపూరి సత్యనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అధికారులు



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడులో రాత్రికి రాత్రే ఆగమేఘాలపై సిమెంట్ వరలతో కాంక్రీట్ నింపి ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసిన వివాదాస్పద స్థలాన్ని రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు శనివారం పరిశీలన చేశారు. ఒక వైపు జాతీయ రహదారి, ఇంకోవైపు బొగ్గేరు నుంచి మహిమలూరు చెరువుకు నీరు సరఫరా చేసే నీటిపారుదల కాలువ ఉండగా, ఈ రెంటికి క్రాసింగ్‌లో బతుకుదెరువు కోసం ఓ వ్యక్తి ఏర్పాటు చేసుకున్న బొంకును టీడీపీ నాయకులు కొనుగోలు చేసి రాత్రికి రాత్రే విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విషయమై స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఆర్ఐ పృథ్వీకుమార్, వీఆర్‌ఓ ప్రతాప్, జలవనరులశాఖ ఏఈ సతీష్‌చంద్ర తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు తీశారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలకు చెందిన స్థలంలో అనుమతులు లేకుండా ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, సరైన చర్య కాదని తెలిపారు. జాతీయ రహదారి రెండు మీటర్లు విస్తరించాల్సి వచ్చినా విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఆక్రమణలు అన్ని తొలగించాల్సి వస్తుందన్నారు. తదుపరి నిర్మాణాలు చేపట్టరాదని వివాదాస్పద నిర్మాణ స్థలం వద్ద నోటీసు బోర్డు ఏర్పాటు చేశామన్నారు.

సంచార పశువైద్యశాల వైద్యుడు వినీత్‌కు పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ వినీత్

కావలి: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ విభాగంలో సేవలందిస్తున్న కావలికి చెందిన పశువైద్యుడు డాక్టర్ ఆవుల వినీత్‌కు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలో సంచార పశువైద్యసేవలు ప్రారంభించి మే 19వ తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సేవలందించి పాడి రైతులకు అండగా నిలిచిన పశువైద్యులను విజయవాడ గన్నవరంలోని ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో లక్ష్యాలు సాధించిన డాక్టర్ ఆవుల వినీత్‌ను పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్ అమరేంద్రకుమార్, ఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ సీఈఓ రామకృష్ణ వర్మ, వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి ప్రశంసాపత్రంతో అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆత్మకూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు అన్నారు. నెల్లూరుపాళెం సచివాలయంలో లబ్ధిదారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. సొంత ఇంటి కలను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించి నిర్మాణానికి నగదు సహాయం అందిస్తోందని, దీనికి తోడు పొదుపు మహిళలకు రూ.30 వేలకు పైగా రుణం సైతం మెప్మా అధికారులు సమకూరుస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆయన లబ్ధిదారులతో అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నటరాజ్, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రీ సైక్లింగ్ కేంద్రం ప్రారంభం

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కస్తూర్బా పార్కు ఆవరణలో రెడ్యూస్-రీ యూజ్-రీ సైకిల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల్లో వాడకంలో లేని నిరుపయోగ ప్లాస్టిక్, పాత పుస్తకాలు, దుస్తులు, చెప్పులు వంటి వస్తువులను ఈ కేంద్రంలో అందజేస్తే వాటిని రీ సైక్లింగ్ ప్రక్రియ ద్వారా ప్రకృతికి అనుగుణంగా వాటిని పునరుత్పాదన చేయగలమన్నారు. నగర పంచాయతీ ప్రజలు గమనించి ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ వినోద్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతిపై ఎమ్మెల్యే సమీక్ష రేపు

బిట్రగుంట: బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మద్దిబోయిన వీరరఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశంలో ఎజెండాలోని అంశాలతో పాటు తాగునీటి సరఫరా, మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాలపై ఎమ్మెల్యే శాఖల వారీగా సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు

చేజర్ల(సోమశిల): జగనన్న లేఅవుట్లలో స్థలాలు పొందిన లబ్ధిదారులకు సంఘ బంధం నుంచి రుణాలు అందిస్తామని అనంతసాగరం ఎంపీడీఓ ఏ మధుసూదనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జగనన్న లేఅవుట్లలో 1,027 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన గృహాలను ప్రారంభించినట్లైతే వారికి ప్రభుత్వం నుంచి మంజూరయ్యే రూ.1.80 లక్షలతో పాటు సంఘ బంధం నుంచి రూ.35 వేల రుణ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు.